సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన

మేయర్ ముక్కా శ్రావణి

విశాఖ జీవీఎంసీ నూతన మేయర్ డాక్టర్ ముక్కా శ్రావణికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

విశాఖ జీవీఎంసీ కూటమి మేయర్‌గా ఘన విజయం సాధించిన డాక్టర్ ముక్కా శ్రావణి దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్ ని శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నూతన మేయర్ డాక్టర్ ముక్కా శ్రావణికి (తరువాయి 8వ పేజీలో)

స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసంలో

ఘనంగా దీపావళి వేడుకలు

రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ అయ్యన్న





నర్సీపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు నివాసంలో దీపావళి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వెలుగుల పండుగను పురస్కరించుకుని ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ దీపావళి వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు ఆయన సతీమణి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి చింతకాయల పద్మావతి, వారి కుమారుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు (తరువాయి 8వ పేజీలో)

గెలుపులో కాదు.. ఓటమిలో తోడుండటమే

నిజమైన నాయకత్వం!

39 వార్డులు గెలిచినా.. ఆ ఒక్కరి కోసం కదిలివచ్చిన టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్

ఓడిన 7వ వార్డు అభ్యర్థికి కొండంత అండ.. కుడుకల శ్రీకాంత్ కుటుంబానికి భరోసా



నర్సీపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం 40 వార్డులకు గానూ 39 స్థానాల్లో టీడీపీ అఖండ విజయం సాధించింది. అయితే, ఈ అఖండ విజయాల సంబరాల్లో మునిగిపోకుండా.. టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ఓడిపోయిన ఏకైక (7వ) వార్డు అభ్యర్థి కుడుకల శ్రీకాంత్ – లీలావతి దంపతుల ఇంటికి వెళ్లి పరామర్శించారు.?"గెలుపోటములు సహజం, అధైర్యపడొద్దు.. పార్టీ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని వారికి భరోసా కల్పించారు. గెలిచినప్పుడు చప్పట్లు కొట్టడమే కాకుండా, ఓడినప్పుడు భుజం తట్టి ప్రోత్సహించే రాజేష్ నాయకత్వ లక్షణాలను స్థానికులు, పార్టీ శ్రేణులు కొనియాడుతున్నారు.

పాఠశాల పిల్లల్లో రక్తహీనత నివారణకు

'మిషన్ 12/12' పటిష్ట అమలు

20 ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో జేసీ విద్యాధరి చర్చ





విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :


జిల్లాలోని పాఠశాలల పిల్లలలో రక్తహీనత నివారణ లక్ష్యంగా అమలు చేస్తున్న 'అనీమియా రహిత పాఠశాలలు-మిషన్ 12/12' కార్యక్రమంపై జిల్లా సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరు, మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల పై 20 ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, హెల్త్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న విద్యార్థినీ విద్యార్థులతో సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి, జీసీడీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి తర్వాత విశాఖలో పెరిగిన

వాయు కాలుష్యం..!

ఒక్కరోజులో 122 నుంచి 229కు చేరిన ఎక్యుఐ

రాత్రి వేళల్లో మరింత ఆందోళనకర స్థాయికి రీడింగ్స్..



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

దీపావళి వేడుకల అనంతరం విశాఖపట్నంలో వాయు కాలుష్యం గణనీయంగా పెరిగింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నవంబర్ 8న సాయంత్రం 4 గంటలకు విడుదల చేసిన బులెటిన్ ప్రకారం నగరంలో ఎక్యుఐ 229గా నమోదైంది. అంతకు (తరువాయి 8వ పేజీలో)

సమ్మిట్ సాక్షిగా..

విశాఖకు శాశ్వత సుందరీకరణ!

నగర రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు..

రహదారులు, జంక్షన్లు, బీచ్ ప్రాంతాలకు కొత్త శోభ

(ప్రభాతవార్త - విశాఖపట్నం)

అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక సదస్సుకు ఆతిథ్యమిస్తున్న విశాఖపట్నం నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో నగరంలో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులు కేవలం సదస్సు వరకే పరిమితం కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, సెంటర్ మీడియన్లు, బీచ్ పరిసరాలు, పర్యాటక ప్రాంతాలను సరికొత్త అందాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి సుందరీకరణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం నుంచి సిరిపురం, ఆర్కే బీచ్, కోస్టల్ బ్యాటరీ, వీఐపీ రోడ్డు మీదుగా జాతీయ రహదారిలోని దొరతోట వై జంక్షన్ వరకు ప్రధాన మార్గాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. నగరంలోని రహదారుల మరమ్మతులు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, డివైడర్లకు రంగులు వేయడం, రోడ్డు మార్జిన్లను సుందరంగా తీర్చిదిద్దడం వంటి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాల అలంకరణ, సెంటర్ మీడియన్లలో అందమైన మొక్కల పెంపకం, పచ్చదనం సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన మార్గాల్లో వీధి దీపాలు నిరంతరం వెలిగేలా చూడాలని, ఎక్కడా చీకటి కనిపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు బీచ్ రోడ్డు, రుషికొండ, పర్యాటక ప్రాంతాలు, ఐఎన్ఎస్ డేగా పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఫుట్‌పాత్‌లు, రహదారులు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడటంతో పాటు వీధి కుక్కలు, పశువుల సంచారాన్ని నియంత్రించాలని ఆదేశించారు. సమ్మిట్‌కు విచ్చేసే అతిథులు బస చేయనున్న సుమారు 22 నుంచి 25 హోటళ్ల పరిసరాలను కూడా ముందుగానే పరిశీలించి పారిశుధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. సమ్మిట్ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ నుంచే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా పలువురు ప్రముఖులు విశాఖకు రానుండగా, 12వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కానున్నారు. 14వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి (తరువాయి 8వ పేజీలో)









రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని

పరుగులెత్తించేందుకు సీఎం చంద్రబాబు కృషి

నైనీపీ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయింది

విశాఖ సీఐఐ సదస్సు కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

విశాఖలో జరగనున్న సీఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తో సమీక్ష నిర్వహించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి డిఎస్ బీవీ స్వామి





విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

విశాఖలో ఈ నెల 12,13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. సీఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో సోమవారం అమరావతి నుంచి జామ్ వేదికగా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సీఐఐ సదస్సు కోసం ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగాఏర్పాట్లుచేస్తున్నామన్నారు. నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ , ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' థీమ్‌తో సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు సుమారు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరవుతారన్నారు. మొత్తం 1,250 మందికి పైగా దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలు, సీఈఓలు, పాలసీమేకర్లు హాజరవుతారన్నారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ (తరువాయి 8వ పేజీలో)

వంశీకృష్ణ పంతం..

జనసేనకు డిప్యూటీ మేయర్ పీఠం!



గ్రేటర్‌లో జనసేనకు కీలక పదవి దక్కేలా వంశీ వ్యూహం!

నాడు మూడు.. నేడు 26.. రెబల్స్‌తో కలిపి 29 మంది బలం

కూటమిలో జనసేనకు సముచిత ప్రాధాన్యత కోసం గట్టిగా పట్టుబట్టిన వంశీకృష్ణ

ఎన్నికల ప్రత్యేక కమిటీ నుంచి పదవుల పంపకం వరకు కీలక సమన్వయం

(విశాఖపట్నం-ప్రభాతవార్త)

మహా విశాఖ రాజకీయాల్లో జనసేన తన ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచుకోవడంతో పాటు నగర పాలక సంస్థలో కీలక పదవిపై దృష్టి సారించింది. డిప్యూటీ మేయర్ పదవి జనసేనకే దక్కాలన్న అంశంపై పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పట్టుదలతో వ్యవహరిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. నాడు మూడు స్థానాలకే పరిమితమైన జనసేన.. నేడు 26 స్థానాలను గెలుచుకోవడం, మరో ముగ్గురు రెబల్ అభ్యర్థుల ప్రాతినిధ్యంతో కలిపి సంఖ్య 29కు చేరడం పార్టీ బలాన్ని చాటుతోంది. ఈ నేపథ్యంలో కూటమిలో జనసేనకు తగిన రాజకీయ ప్రాధాన్యత, నగర పాలనలో కీలక బాధ్యతలు కల్పించాలనే దిశగా వంశీకృష్ణ చేస్తున్న (తరువాయి 8వ పేజీలో)

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవలందించాలి: ఎంపీ శ్రీభరత్

విశాఖ దక్షిణంలో టీడీపీ విజయాన్ని ప్రజలకు అంకితం చేయాలి.. నూతన కార్పొరేటర్లకు ఎంపీ పిలుపు



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

జీవీఎంసీ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని వారికి అంకితం చేస్తూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములై నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలని విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ నూతన టీడీపీ కార్పొరేటర్లకు సూచించారు. ప్రజలు (తరువాయి 8వ పేజీలో)

సీఐఐ సదస్సు ప్రారంభానికి

48 గంటల ముందే వేదికలన్నీ సిద్ధంగా ఉండాలి



పర్యాటక ప్రాంతాలను సుందరీకరించాలి.. బీచ్‌ల వద్ద, హోటల్ వద్ద పరిశుభ్రంగా ఉంచాలి

పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యువరాజ్



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కోసం వేదికలన్నీ మంగళవారం నాటికే సిద్ధం చేసి పోలీస్ వారి తనిఖీల కోసం అప్పగించాలని పరిశ్రమలు, వాణి జ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (తరువాయి 8వ పేజీలో)

36వ వార్డులో..

జనసేన అభ్యర్థికి

టీడీపీ నేతల మద్దతు కరువు!

స్వతంత్ర అభ్యర్థికి టీడీపీ ఇన్‌చార్జి సీతం రాజు సుధాకర్ మద్దతు

ఇచ్చారంటూ

జనసేన నేత సాదిక్ ఆరోపణ



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :

36వ వార్డులో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థికి మద్దతుగా నిలవాల్సిన తెలుగుదేశం పార్టీ నాయకులు, స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలిపారని జనసేన పార్టీ నాయకుడు సాదిక్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీస స్పందన లేదని ఆయన విమర్శించారు.వి జె ఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాదిక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలన్నీ సమన్వయంతో (తరువాయి 8వ పేజీలో)

విశాఖ సుందరీకరణపై

'గ్రేటర్' కమిషనర్ ప్రత్యేక దృష్టి



(ప్రభాతవార్త -విశాఖపట్నం)

విశాఖ నగరంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో నగర సుందరీకరణ, అభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేక దృష్టి సారించారు. సమ్మిట్ కోసం చేపడుతున్న పనులు తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఉండాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంతో పాటు యూనివర్సిటీ రోడ్డు, వీఐపీ రోడ్డు, మద్దిలపాలెం, మధురవాడ, రుషికొండ, ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, సెంటర్ మీడియన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, రోడ్ల మరమ్మతులు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మొక్కల పెంపకం, విద్యుత్ దీపాల అలంకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బీచ్ రోడ్డు, పర్యాటక (తరువాయి 8వ పేజీలో)

బియ్యం దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల

విస్తృత తనిఖీలు

ఆరు కేసులు నమోదు



సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ ముక్కా శ్రావణి

(7వ పేజీ తరువాయి)

హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, జీవీఎంసీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన పౌర సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మేయర్‌గా తనదైన శైలిలో సమర్థవంతమైన పాలన అందిస్తూ విశాఖ నగర అభివృద్ధిలో ప్రత్యేక ముద్ర వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రసాద్, మాసిపోగు మీరు జోస్ పలువురు జనసేన, కూటమి నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసంలో ఘనంగా దీపావళి వేడుకలు

(7వ పేజీ తరువాయి)

చింతకాయల రాజేష్, కోడలు శ్రీమతి దివ్యశ్రీ మరియు ఇతర కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా పండుగ వాతావరణంలో అందరూ కలిసి ఆనందంగా గడిపారు. ఈ శుభ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు హృదయపూర్వక దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే ఈ దీపావళి పండుగ.. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు మరియు సిరిసంపదలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

దీపావళి తర్వాత విశాఖలో పెరిగిన వాయు కాలుష్యం..!

(7వ పేజీ తరువాయి)

ముందు రోజు ఇదే సమయా నికి 122గా ఉన్న గాలి నాణ్యత సూచీ ఒక్కరోజులోనే 107 పాయింట్లు పెరిగింది. సిపిబిసి లెక్కల ప్రకారం 229 ఎక్యుఐ అంటే 'పూర్' కేటగిరీ. ఈ స్థాయి గాలిని ఎక్కువసేపు పీల్చడం వల్ల చాలామందికి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోవైపు, రియల్‌టైమ్ ఎక్యుఐ ట్రాకర్‌లో నవంబర్ 8 రాత్రి 11 గంటల సమయంలో విశాఖకు 500 వరకు గరిష్ఠ రీడింగ్ కనిపించింది. అయితే ఇది సిపిబిసి నగర సగటు బులెటిన్‌తో సమానమైన కొలత కాదు. 404 ఎక్యుఐ నమోదైందన్న వైరల్ ప్రచారానికి కూడా ప్రస్తుతం స్పష్టమైన అధికారిక నిర్ధారణ లేదు. దీపావళి టపాసుల పొగతో పాటు ఇతర కాలుష్య కారకాలు కూడా గాలి నాణ్యతపై ప్రభావం చూపి ఉండవచ్చు. నగరంలో కాలుష్య స్థాయిలపై అధికారిక పర్యవేక్షణ, తాజా వివరాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

సమ్మిట్ సాక్షిగా.. విశాఖకు శాశ్వత సుందరీకరణ!

(7వ పేజీ తరువాయి)

సి.పి. రాధాకృష్ణన్ విచ్చేయనున్నారు. వివిధ దేశాల మంత్రులు, రాయబారులు, పారిశ్రామికవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు నగరానికి రానున్న నేపథ్యంలో విశాఖ ప్రతిష్టకు తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. సమ్మిట్ కోసం చేపడుతున్న పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సదస్సు ముగిసిన తర్వాత కూడా నగర ప్రజలకు, పర్యాటకులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు కొనసాగాలన్నది జీవీఎంసీ లక్ష్యంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ అతిథుల రాకతో విశాఖకు లభిస్తున్న అవకాశాన్ని నగరాభివృద్ధికి వేదికగా మలుచుకోవాలన్న దిశగా జీవీఎంసీ అడుగులు వేస్తోంది.

అవంతిలో ఘనంగా డిగ్రీ కళాశాల ప్రెషర్స్ డే వేడుకలు

విశాఖపట్నం–ప్రభాతవార్త



తగరపువలస, అవంతి డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలను అవంతి విద్యాసంస్థల చైర్మన్ మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు కార్యక్రమానికి విచ్చేసిన అతిథులతో జ్యోతి వెలిగించి ప్రారంభిం చారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ ఎ.నరసింహా రావు, మాజీ రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ చాలా వేగంగా అభివృద్ధి చెందుతుంది, మీరు కేవలం పరీక్షలు కోసమే చదవడం కాదు, మారుతున్న సమాజానికి అనుగుణంగా నైపుణ్యాలుపైన, నూతన అంశాలపైన అవగాహన పెంచుకొని చదువుకోవాలని ఉపదేశించారు. మీరు ఇతరులతో పోల్చు కోవద్దు. మంచి ఆలోచనలు కలిగి ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటుచేసుకోవాలని అభిప్రాయంవ్యక్తం చేసారు. ప్రతి విద్యార్థి ఒకలక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం శ్రమించాలని సూచించారు. గౌరవ అతిథిగా టీ.చాముండేశ్వరరావు, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, విజయనగరం విద్యార్థులను ఉద్దేశించి ప్రస్తుతము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీరు పారిశ్రామిక వేత్తలుగా స్థిర పడాలనుకున్నా ప్రభుత్వం ప్రోత్సాహం ఎక్కువగా వుంది. మీరు ప్రస్తుతం ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ రంగంలో ఏఐ టూల్స్ ఉపయోగించి నైపుణ్యము కలిగి ఎక్కువగా ఉద్యోగవకాశాలు కూడా పొందవచ్చునని హితవు పలికారు. ప్రస్తుత ప్రపంచములో అభివృద్ధికి అనుగుణంగా అధునాతన కోర్సులు కలిగి ఉన్నాయి వాటిలో నైపుణ్యత సాధించి ఉద్యోగఅవకాశములు పొందాలన్నారు. మీరు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగాలని సూచించారు. నూతన కోర్సులు పైన నైపుణ్యం కలిగి ఉండాలని ప్రోత్సహించారు. ప్రత్యేక అత్యధిగా గొంపా దివాకర్ యాదవ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, భీమునిపట్నం మాట్లాడుతూ విద్యా ర్థిదశలో మంచిఆలోచనలు కలిగి ఉజ్వలభవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేసారు. అలాగే చెడువ్యసనాలకు అంటే ర్యాగింగ్, డ్రగ్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, స్పీడ్ బైక్ డ్రైవింగ్, దూమపానలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. మీతల్లిదండ్రులు మిమ్మల్ని చూసి గర్వపడే విధంగా మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అవంతి కళాశాల డైరెక్టర్ డా.ఎ.చంద్ర శేఖర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అందుకోగలరని, అలాగే ప్రతి విద్యార్థి ఒకలక్ష్యం ఏర్పాటు చేసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులతో మంచి స్నేహ సంబంధం ఏర్పాటు చేసుకోవాలని హితువుపలికారు. అలాగే సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గనిర్దేశాలుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాలైన ఆటలు పోటీలను నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలను, కేరింతలును చూసి అతిథులు సంతోషం వ్యక్తంచేసారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో నూతనోత్సహాన్ని కలిగించాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ, అధ్యాపకులు, భోదన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి: గంటా

విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ ప్రభుత్వానికి, ప్రజలకు మంచి పేరు తేవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీ అభ్యర్థులు ఎంపీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. విజేతలతో పాటు కూటమి పార్టీల మద్దతుదారులు పెద్దఎత్తున రావడంతో కార్యాలయం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలిచ్చిన తీర్పు మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం జెడ్పీటీసీలు మూడూ గెలుచుకుని 100 పర్సెంట్ స్ట్రైక్ రేట్ సాధించామని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో తిరుగులేని విజయాన్ని అందుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు, గెలుపు కోసం పని చేసిన కూటమి పార్టీల శ్రేణులకు అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీలుగా గెలిచిన గాదు అలివేణి, కోరాడ సత్యవతి, ఎన్ని శ్రీనివాసరావు, ఎంపీపీ అభ్యర్థులు తాట్రాజు అప్పారావు, కుచ్చర్లపాటి అరుణ కుమారి, యరబాల కృష్ణవేణిలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, టీడీపీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, గాదు వెంకటప్పడు, యరబాల అనిల్ ప్రసాద్, సరగడ అప్పారావు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు

ఆరు కేసులు నమోదు

విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాత వార్త:

రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు,సోమవారం ఉదయం 11:30 గంటలకు విశాఖపట్నం నగర పరిధిలోని పలు బియ్యం రిటైల్, హోల్‌సేల్ వ్యాపార దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, లీగల్ మెట్రాలజీ, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో మూడు బియ్యం వ్యాపార సంస్థలను తనిఖీ చేయగా, పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.

శ్రీ మణికంఠ రైస్ ట్రేడర్స్:

ఈ దుకాణంలో యజమాని బియ్యం రిటైల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. తనిఖీలలో 10 కిలోల బరువు కలిగిన సుందర రత్న ప్రీమియం సోనా రైస్ బ్రాండ్‌కు చెందిన 17 బస్తాలపై గరిష్ఠ చిల్లర ధర ప్యాకింగ్ తేదీలను మార్చి, స్పష్టంగా కనిపించకుండా చేసినట్లు గుర్తించారు.

ప్రదీప్ ట్రేడర్స్ అండ్ జనరల్ స్టోర్స్:

ఈ దుకాణంలో యజమాని శ్రబియ్యం మరియు కిరాణా సరుకుల రిటైల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. తనిఖీలలో 26 కిలోల బరువు కలిగిన సార్టెక్స్ రైస్ (999 గోల్డ్ బాయిల్డ్ రైస్) బ్రాండ్‌కు చెందిన 5 బస్తాలపై తయారీదారు/ప్యాకర్ పేరు మరియు చిరునామా ముద్రించకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

వెంకట లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్:

యజమాని బియ్యం హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. తనిఖీలలో క్రింది బియ్యం నిల్వలను గుర్తించారు.

- సార్టెక్స్ రైస్ (999 గోల్డ్ బాయిల్డ్ రైస్) – – 17 బస్తాలు (26 కిలోలు ఒక్కొక్కటి).
- గోకుల్ సటాకే ప్రీమియం రైస్ -– 8 బస్తాలు (26 కిలోలు ఒక్కొక్కటి).
- కిసాన్ బ్రాండ్ జై శ్రీరామ్ లచ్చకరి రైస్ – – 450 బస్తాలు (26 కిలోలు ఒక్కొక్కటి).

పై బియ్యం ప్యాకెట్లపై తయారీదారు/ప్యాకర్ పేరు మరియు చిరునామా ముద్రించకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

తీసుకున్న చర్యలు:

పై వ్యాపార సంస్థలపై లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011లోని రూల్ 24(ఫ), రూల్ 4, రూల్ 6(1)(ఫ) నుంచి (వ) వరకు, రూల్ 6(2), రూల్ 6(11) మరియు రూల్ 18(1) నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 6 కేసులు నమోదు చేశారు. వీటిలో 5 కేసులను మొత్తం రూ.1,25,000/- జరిమానాతో కాంపౌండ్ ఈ తనిఖీల ద్వారా బియ్యం ప్యాకెట్లపై తప్పనిసరిగా ముద్రించాల్సిన వివరాలు, ధరలు ప్యాకింగ్ తేదీల విషయంలో నిబంధనలు పాటించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వినియోగదారులకు సరైన సమాచారం అందించడం, పారదర్శక వ్యాపార పద్ధతులను అమలు చేయడం చట్ట నిబంధనలు పాటించేలా వ్యాపారులకు అధికారులు సూచించారు.

జనసేనకు డిప్యూటీ మేయర్ పీఠం!

(7వ పేజీ తరువాయి) ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి.

మూడు నుంచి 26కు.. జనసేన ప్రస్థానంతో వంశీ ముద్ర!

2021 జీవీఎంసీ ఎన్నికల్లో మూడు స్థానాలకే పరిమితమైన జనసేన.. తాజా ఎన్నికల్లో 26 వార్డులను కైవసం చేసుకోవడం విశాఖ రాజకీయాల్లో కీలక పరిణామం. ఈసారి కూటమిలో 32 స్థానాల్లో పోటీ చేసే అవకాశం కల్పించడంలోనూ వంశీకృష్ణ శ్రీనివాస్ చొరవ కీలకంగా నిలిచింది. తొలుత స్థానాల కేటాయింపుపై చర్చలు జరిగిన సమయంలో జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయ కత్వం వద్ద ఆయన గట్టిగా తన వాదన వినిపించారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి పార్టీకి మరిన్ని స్థానాలు దక్కేలా కృషి చేశారు. చివరకు 32 స్థానాల్లో పోటీ చేసి 26 స్థానాలను గెలుచుకోవడం జనసేనకు గ్రేటర్‌లో కొత్త రాజకీయ గుర్తింపును తీసుకొచ్చింది.

ఎన్నికల ప్రత్యేక కమిటీలో కీలక వ్యూహకర్త!

జీవీఎంసీ ఎన్నికల ప్రత్యేక కమిటీలో వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. అభ్యర్థుల ఎంపిక, వార్డుల కేటాయింపు, ప్రచార ప్రణాళిక, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాల్లో ఆయన చురుకుగా వ్యవహరించారు. నగర రాజకీయాలపై తనకున్న అనుభవం, క్షేత్రస్థాయి నాయకులతో ఉన్న అనుబంధాన్ని ఉపయోగించుకుని ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లారు. కూటమిలో జనసేనకు ప్రాధాన్యత కల్పించడం నుంచి అభ్యర్థుల విజయానికి అవసరమైన సమన్వయం వరకు పలు అంశాల్లో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

డిప్యూటీ మేయర్ పదవి జనసేనకే.. వంశీ పట్టుదల!

మేయర్ పదవి తెలుగుదేశం పార్టీకి దక్కిన నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలన్న డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. 26 మంది కార్పొరేటర్ల విజయంతో పాటు మరో ముగ్గురు రెబల్ అభ్యర్థుల మద్దతు కలిస్తే జనసేన ప్రాతినిధ్యం 29కు చేరుతున్న నేపథ్యంలో నగర పాలనలో పార్టీకి తగిన స్థానం కల్పించాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ అంశంపై వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి నాయకత్వం వద్ద జనసేన తరఫున తన అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో పార్టీకి ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి చేసిన ఆయన.. ఇప్పుడు కీలక పదవుల పంపకంలోనూ జనసేనకు సముచిత స్థానం దక్కేలా ప్రయత్నిస్తున్నారన్న చర్చ సాగుతోంది.

కూటమి సమన్వయంలో వంశీ కీలక పాత్ర!

కూటమిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం కొనసాగించడం నగర పాలనకు అత్యంత అవసరం. ఈ క్రమంలో జనసేన నగర అధ్యక్షుడిగా వంశీకృష్ణ శ్రీనివాస్ బాధ్యత మరింత పెరిగింది. పార్టీ కార్పొరేటర్లను ఏకతాటిపైకి తీసుకురావడం, కూటమి భాగస్వాములతో సమన్వయం చేయడం, నగర అభివృద్ధి అంశాల్లో జనసేన అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.

ఎన్నికల విజయమే కాదు.. పాలనలోనూ జనసేన ముద్ర!

తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో జనసేన కార్పొరే టర్లు క్రియాశీలకంగా వ్యవహరించేలా కార్యాచరణ రూపొందించాల్సి ఉంది. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ ప్రాతినిధ్యం స్పష్టంగా కనిపించేలా వంశీకృష్ణ సమన్వయ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. మొత్తంగా గ్రేటర్ ఎన్నికల్లో జనసేన సాధించిన ప్రాతినిధ్య విస్తరణ వెనుక వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వహించిన పాత్రతో పాటు, ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవిపై ఆయన చేస్తున్న ప్రయత్నాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. పార్టీకి ఎన్నికల్లో వచ్చిన బలాన్ని నగర పాలనలోనూ తగిన ప్రాతినిధ్యంగా మలచాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవలందించాలి: ఎంపీ శ్రీభరత్

(7వ పేజీ తరువాయి)

పార్టీపై ఉంచిన నమ్మకాన్ని మరింత పెంపొందించేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, విశాఖ దక్షిణ నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అనే విషయాన్ని తమ పనితీరుతో నిరూపించాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున విజయం సాధించిన 35వ వార్డు కార్పొరేటర్ మజ్జి త్రినాథరావు, 30వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 45వ వార్డు కార్పొరేటర్ ఆక్కిరెడ్డి జగదీష్, 38వ వార్డు కార్పొరేటర్ పుక్కళ్ళ రాజేశ్వరి, 44వ వార్డు కార్పొరేటర్ గోలగాని జ్యోతి సోమవారం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో మేయర్ డాక్టర్ ముక్కా శ్రావణితో కలిసి శ్రీభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో సాధించిన విజయంపై తమ ఆనందాన్ని ఆయనతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, కూటమి కార్పొరేటర్లందరితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. కార్పొరేటర్లుగా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. మేయర్ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను తమ తమ వార్డుల్లో అమలు చేసేలా కృషి చేయాలని కోరారు. జీవీఎంసీ పాలనలో సమష్టి కృషి, పరస్పర సమన్వయంతో నగర అభివృద్ధికి తోడ్పడాలని నూతన కార్పొరేటర్లకు ఎంపీ శ్రీభరత్ సూచించారు.

జనసేన అభ్యర్థికి టీడీపీ నేతల మద్దతు కరువు!

(7వ పేజీ తరువాయి)

ఒకరికొకరు మద్దతుగా నిలవాల్సి ఉండగా, అందుకు భిన్నంగా స్వతంత్ర అభ్యర్థుల విజయానికి సహకరించేలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. 36వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి పోటీ చేసినప్పటికీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతం రాజు సుధాకర్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు కనీసం ప్రచారానికి కూడా రాలేదని ఆరోపించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం అంటే ఇదేనా అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం వెంటనే స్పందించి, సీతం రాజు సుధాకర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సాదిక్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

48 గంటల ముందే వేదికలన్నీ సిద్ధంగా ఉండాలి

(7వ పేజీ తరువాయి) ఎన్.యువరాజ్ నిర్వాహకులను ఆదేశిం చారు. అన్ని నిర్మాణాలు, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా, ఆడియో సిస్టమ్ తదితర అన్ని మౌలిక అవసరాలను పోలీస్‌వారు తనిఖీ చేసి ధృవపత్రాలను అందజేయాలని సూచిం చారు. ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై యువరాజ్ సోమవారం సమీక్షించారు. పార్టనర్‌షిప్ సమ్మిట్ కోసం 11వ తేదీనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర డెలిగేట్లు, ఉన్నతాధికారులు నగరానికి రానున్నారని, 14వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 12న సమ్మిట్ ప్రారంభోత్సవానికి కేంద్ర హోమ్ శాఖామంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖల మంత్రి పీయూష్ గోయల్ వస్తున్నారని, ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ వస్తున్నారని, అలాగే ఇతర దేశాల మంత్రులు, అంబాసిడర్లు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధి కారులు విచ్చేస్తున్నారని తెలిపారు. వీరికోసం ఏర్పాటు చేసిన హోటళ్లు, వాహనాలు, లైజెన్ అధికారులు ప్రోటోకాల్ అధికారులు వారికి కేటాయించిన వి.ఐ.పిలతో మాట్లాడుకొని వారికి భోజన, వసతి కల్పన లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. 14వ తేదీన వి.ఐ.పిల సందర్శన కోసం గుర్తించిన పర్యాటక ప్రాంతాల వద్ద , బీచ్ ల వద్ద విద్యుత్, పూల, మొక్కలతో సుందరీకరణ చేయాలని, ఆ ప్రాంతాల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కు సూచించారు. అన్ని వేదికల వద్ద సమాచార శాఖ రూపొందించిన బ్యాక్ డ్రాప్ ను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ సమ్మిట్ కోసం విచ్చేసిన అతిథుల కోసం 26 హోటళ్ల లో 580 రూం లను గుర్తించడమైనదని, ఎవరికి ఎక్కడ కేటాయించడం జరిగిందనేది ఇప్పటికే లైజెన్ అధికారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రధాన వేదిక వద్ద, ఇతర వేదికల వద్ద సీటింగ్ ఏర్పాట్లను చేసి డీమార్కింగ్ చేయాలని, అలాగే భోజనాలను కూడా వేర్వేరుగా ఏర్పాటు చేయడం జరిగిందనీ, ఎవరికి ఎక్కడ అనేది స్పష్టంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా వేదికల ఇంచార్జ్ లు వారికి కేటాయించిన అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. ఈ సమావేశం లో సి.పి శంఖబ్రత్ భాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ విద్యాధరి, ఏపిఐఐసి ఎం.డి దినేష్ కుమార్, ఈ డి బి సి.ఈ.ఓ షణ్మోహన్, పోలీస్‌శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రేమకు నిలువెత్తు రూపం క్రీస్తు

కోటిన్నర ఖర్చుతో జ్ఞానాపురంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఆదర్శ దంపతులు


కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, బిషప్ ఉడుముల బాల

క్రైస్తవ సమూహంతో భారీ పూజ.. 3000 మందికి భోజనాలు ..



జ్ఞానాపురం, నవంబర్ 9, ప్రభాతవార్త :

జ్ఞానాపురం రక్షణ గిరి కొండపై ఆకాశాన్ని తాకేలా ఏర్పాటుచేసిన 33 అడుగుల క్రీస్తు స్వరూప మహా ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల తో, రంగ రంగ వైభవంగా జరిగింది. ఆర్చ్ బిషప్ డా. ఉడుముల బాల రెడ్డి , 42 వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ల తో స్వరూపాన్ని ప్రారంభించారు. క్రీస్తు స్వరూప విగ్రహ నిర్మాణానికి కోడిగుడ్ల శ్రీధర్ దంపతులు ఆర్థిక సహాయం అందించినట్టు బిషప్ బాల తెలిపారు. ఆదివారం సాయం త్రం క్రీస్తు విగ్రహాన్ని ప్రారంభోత్సవంలో బిషప్ మాట్లాడుతూ 33 అడుగుల భారీ క్రీస్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కోడిగుడ్ల వంశ స్థులు ఆదర్శనీయులని పేర్కొన్నారు. ఈ విగ్రహంతో విశాఖపట్నం, జ్ఞానాపురం ఎనలేని కీర్తి కిరీటాలు సొంతం చేసుకుంటుం దన్నారు. జ్ఞానాపురం గ్రామం ఉత్తరాంధ్ర క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. శంకుస్థాపన చేసిన నాటి నుంచి వారి సొంతనిధులతో విగ్రహ పనులు పూర్తి చేయడం ఆనందదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొ రేటర్ పూర్ణిమ శ్రీధర్లు మాట్లాడుతూ ప్రారం భోత్సవం సందర్భంగా 3000మందికి భోజ నాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్తరాం ధ్ర జిల్లాలో ఉన్న కతోలిక, కతోలికేతర క్రైస్తవులు, ప్రజలు స్వరూపాన్ని సంద ర్శించవచ్చు అన్నా రు. ఈ కార్యక్రమం లో జ్ఞానా పురంతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్య దేవాది దేవుడికి వందనాలు సమర్పిం చారు. క్రీస్తు స్వరూపాన్ని ఏర్పాటు చేసిన దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు.



దయాల్‌నగర్‌లో ఘనంగా 37వ శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

వేలాది మంది మహిళలతో కన్నులపండువగా శోభాయాత్ర

అరకులోయ జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి పెట్టెలి దాసుబాబు విజయం



వైసీపీ అభ్యర్థి కమిడి అశోక్‌పై 1,768 ఓట్ల మెజార్టీతో గెలుపు

అరకులోయ, నవంబర్ 9, ప్రభాతవార్త

అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అరకులోయ జడ్పీటీసీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పెట్టెలి దాసుబాబు కైవసం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి కమిడి అశోక్‌పై 1,768 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో వివిధ పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ అభ్యర్థి పెట్టెలి దాసుబాబుకు 10,718 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కమిడి అశోక్‌కు 8950 వచ్చాయి. దీంతో దాసుబాబు 1768 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికలలో పోటీ చేసిన సీపీఎం అభ్యర్థి గెమ్మెలి చిన్నబాబుకు 5,251 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పాచిపెంట శాంత కుమారికి 2,181 ఓట్లు వచ్చాయి. జనసేన (ఏపీ) అభ్యర్థి శెట్టి దివ్యకు 48 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి శెట్టి లక్ష్మీ నారాయణకు 206 ఓట్లు, టీసీవై పార్టీ అభ్యర్థి కిల్లో రాజాభరత్‌కు 99 ఓట్లు పోలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు కొర్రా మధుసూదనరావుకు 119 ఓట్లు, తెలగంజి సోమేశ్వరరావుకు 370 ఓట్లు వచ్చాయి. నోటాకు 305 ఓట్లు పోలవగా, 1,502 ఓట్లను అధికారులు చెల్లనివిగా గుర్తించారు. అరకులోయ జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ అభ్యర్థి పెట్టెలి దాసుబాబు గెలుచుకోవడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

మెజార్టీ ఎంపీటీసీ స్థానాలను దక్కించుకున్న వైఎస్సార్ పార్టీ





పాడేరు, నవంబర్ 9, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఏడు జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకొని అధిత్యం సాధించి నూతనంగా ఏర్పడిన అల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవిని దక్కించుకుని ఏజెన్సీలో మరో సారి ఈ స్థానిక స.స్థల ఎన్నికల్లో కూడా వైసిపి హవా కొనసాగించింది. అలాగే ఆల్లూరు జిల్లాలో 172 ఎంపీటీసీ స్థానాలకు గాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 88 ఎంపిటిసి స్థానాలను కైవసం చేసుకుని జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ స్థానాలను దక్కించుకుంది. అలాగే ఎన్నికల్లో ఏజెన్సీలో తెలుగుదేశం పార్టీ 47 ఎంపీటీసీ స్థానాలను దక్కించుకొని ద్వితీయ స్థానంలో ఉంది. అలాగే ఆల్లూరు జిల్లాలో జనసేన పార్టీ 12 ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించగా బిజెపి అల్లూరు జిల్లా వ్యాప్తంగా ఆరు ఎంపీటీసీ స్థానాలను స్థానాలను కనీసం చేసుకుంది జిల్లాలో ఉన్న 11 మండలాల్లో సిపిఐ సిపిఎం వామపక్షాలు రెండు ఎంపీటీసీ స్థానాలను దక్కించుకుంది కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీటీసీస్థానం గెల్చుకుంది. జిల్లా వ్యాప్తంగా 16 మంది స్వాతంత్ర అభ్యర్థులు ఎంపీటీసీలుగా గెలుపొందారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 జడ్పిటిసి స్థానాలు ఉండగా ఇందులో జడ్పిటిసి స్థానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు జడ్పిటిసిలుగా విజయం సాధించారు. మూడు జెడ్పిటిసి స్థానాలను ఉమ్మడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు సమీప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై విజయం సాధించారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఆనంతగిరి జడ్పిటిసి మినహా మిగిలిన 10 జడ్పిటిసి లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జడ్పిటిసిలుగా గెలుపొందారు. అయితే ఈసారి జరిగిన స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీల మద్దతుతో టిడిపి మూడు స్థానాల్లో విజయం సాధించింది. పాడేరు, అరకు అసెంబ్లీ పరిధిలో ఉన్న జెడ్పీటీసీ స్థానాల్లో ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో విజయం సాధించడంలో విఫలం చెందిన చెప్పాలి.

ధృవీకరణ పత్రాలు అందుకున్న జెడ్పీటీసీ విజేతలు

అల్లూరి జిల్లాలో 11 మండలాల్లో జెడ్పీటీసీలుగా గెలుపొందిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య శర్మ అందజేశారు. జెడ్పీటీసీ ధృవీకరణ పత్రాలు అందుకున్న వారిలో పాడేరు జెడ్పీటీసీ సీదరి రాంబాబు,(వైసిపి),జి.మాడుగుల జెడ్పీటీసీ సోమెలి అఖిల(టిడిపి),ముంచంగిపుట్ట జెడ్పీటీసీ కొర్ర త్రినాథ్,(సిపిఎం) డుంబ్రిగూడ జెడ్పీటీసీ కిముడు హరి(వైసిపి), హుకుంపేట, జడ్పిటిసి ఒంటుబు ప్రియాంక, (వైసిపి), పెదబయలు జడ్పిటిసి, వంతల శాంతి(వైసిపి), ,చింతపల్లి జెడ్పీటీసీ, కోరాబు అనూష దేవి(వైసిపి)జీకేవీధి జెడ్పీటీసీ కంకిపాటి గిరి ప్రసాద్(వైసిపి), కొయ్యూరు జెడ్పీటీసీ ముట్టడం హిమబిందు(టిడిపి), అరకు జెడ్పీటీసీ దాసుబాబు(టిడిపి),అనంతగిరి జెడ్పీటీసీ దురు జయవర్ధిని(వైసీపీ) జెడ్పీటీసీలుగా ధృవీకరణ పత్రాలు పీఓ ఆదిత్య వర్మ చేతుల మీదుగా అందుకున్నారు.

జీకే వీధి ఎంపీపీ పీఠంపై ఉత్కంఠ.. తెరపైకి పూజారి లీలా ప్రసాద్ పేరు



గూడెం కొత్తవీధి, నవంబర్ 9, ప్రభాతవార్త

గూడెం కొత్తవీధి మండలంలోని జీకే వీధి-1 ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థి పూజారి లీలా ప్రసాద్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. అదే విధంగా జీకే వీధి-3 ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థి బొబ్బిలి లక్ష్మణ్ గెలుపొందారు. అయితే, ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన వారు కావడంతో మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) పదవి ఎవరికి దక్కుతుందన్న అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తొలుత ఎంపీపీ పదవికి బొబ్బిలి లక్ష్మణ్ పేరు ఖరారైనట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఎన్నికల ఫలితాల అనంతరం పూజారి లీలా ప్రసాద్ పేరు తెరపైకి రావడంతో ఎంపీపీ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. పలువురు నాయకులు బొబ్బిలి లక్ష్మణ్‌కు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు పూజారి లీలా ప్రసాద్‌కు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వైసీపీకి చెందిన కొందరు నాయకులు, శ్రేయోభిలాషులు పూజారి లీలా ప్రసాద్‌కు ఎంపీపీ పదవి కేటాయించాలని పార్టీ అధిష్ఠానాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ, మండల అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఆయనకు కల్పించాలని కోరుతున్నారు. అయితే, ఎంపీపీ అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానమే తీసుకుంటుందని వైసీపీ సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జీకే వీధి మండల ఎంపీపీ పీఠం బొబ్బిలి లక్ష్మణ్‌కు దక్కుతుందా? లేక పూజారి లీలా ప్రసాద్‌కు అవకాశం లభిస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

జీకే వీధి ఎంపీపీగా యువ నాయకుడికే అవకాశం కల్పించాలి

మాజీ ఎంపీటీసీ అపరంగి బుజ్జిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరి కొండలరావు

గూడెం కొత్తవీధి, నవంబర్ 9, ప్రభాతవార్త



జీకే వీధి మండల అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే చిత్తశుద్ధి కలిగిన యువ నాయకుడికే ఎంపీపీ పదవి దక్కాలని మాజీ ఎంపీటీసీ అపరంగి బుజ్జిబాబు, కూటమి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరి కొండలరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రగతిని కాంక్షించే చురుకైన యువ నాయకుడిని ఎంపీపీగా ఎన్నుకునేందుకు నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు ముందుకు రావాలని సూచించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అక్రమాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారికి కీలక పదవులు దక్కకుండా చూడాల్సిన బాధ్యత ఎంపీటీసీలపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే నిజాయతీపరుడు, మచ్చలేని వ్యక్తికి ఎంపీపీ పదవి కల్పించేలా సభ్యులంతా సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నాయకత్వాన్ని ఎన్నుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు..

మాతా శిశు మరణాల సంఖ్య తగ్గింపుకు కృషి అవసరం : గీతం వైద్యులు

ఆరిలోవ, నవంబర్ 09, ప్రభాతవార్త

మాతా శిశు మరణాల సంఖ్య తగ్గింపుకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గీతం యూనివర్సిటీ వైద్యులు డాక్టర్ షారోన్, డాక్టర్ మురళి కృష్ణ, అన్నారు. గీతం వైద్య కళాశాలలో సోమవారం జరిగిన బాల్యవివాహ ముక్త్ భారత్ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో వైద్యులు పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ అధికారిక దత్తతను ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా ఎన్.ఐ.సి. బి.పి.ఒమమత మాట్లాడుతూ, బాలల సంరక్షణ, దత్తత ప్రక్రియ, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి విద్య, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కౌన్సిలర్ కె.శకుంతల మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఔటరీచ్ వర్కర్ ఎస్.లీలావతి బాలల రక్షణ కోసం అందుబాటులో సేవలుగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గీతం వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వింగ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఎస్.రాయవరం, నవంబర్ 9, ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఎస్.రాయవరం గ్రామంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వింగ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎని మిదవ తరగతి చదువుతున్న 15 మంది విద్యా ర్థులకు ఎన్ఎంఎం ఎస్ స్టడీ మెటీరియల్ అందజే శారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఎం.ఆనంద్ సెక్రెటరీ జయప్రకాష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీసం ప్రసాదు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన ధింసా నృత్యాల నడుమ కూటమి విజయోత్సవ సంబరాలు

గూడెం కొత్తవీధి, నవంబర్ 9, ప్రభాతవార్త



మండలంలోని రింతాడలో కూటమి అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీ సోమవారం ఘనంగా నిర్వహించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన రింతాడ ఎంపీటీసీ జనసేన అభ్యర్థి గెమ్మెలి పాల్స్, పంచుల జనసేన ఎంపీటీసీ మర్రి సూర్యనారాయణ అభ్యర్థుల గెలుపును పురస్కరించుకుని కూటమి శ్రేణులు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. రింతాడ పురవీధుల్లో నిర్వహించిన ఈ ఊరేగింపులో కూటమి నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ర్యాలీ పొడవునా గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ ధింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక గిరిజన కళాకారులు సాంప్రదాయ వాయిద్యాల వాయిస్తూ లయబద్ధంగా చేసిన నృత్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కూటమి ముఖ్య నేతలు మాట్లాడుతూ ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా,మారుమూల గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి,ప్రజా సమస్యల పరిష్కారానికి అభ్యర్థులు నిరంతరం శ్రమిస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాడేరు జడ్పిటిసి ఎన్నికల సమన్వయకర్త గొర్లె వీరవెంకట్,కృష్ణవంశీ అనిల్,పాంగి శ్రీను, బాలరాజు,సిద్దు, కోటి,తెలుగుదేశం పార్టీ నాయకులు వడేలి పాండురాజు,ఏఎంసి డైరెక్టర్ మోట్టడం సర్పన్నదొర, సంజీవరావు,రామారావు బీజేపీలకు చెందిన పలువురు ముఖ్య నేతలు,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పాడేరులో ఘనంగా దీపావళి వేడుకలు

పాడేరు,నవంబర్9,ప్రభాతవార్త



అల్లూరు సీతారామరాజు జిల్లా కేంద్రంలో ఘనంగా దీపావళి పండగ వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. ముందుగా దేవుళ్ళకు దీపారాధన ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కుటుంబ సమేతంగా అందరూ కలిసి దివ్వెల కొట్టి నమస్కరించారు. అనంతరం మందుగుండు సామాగ్రి ఇళ్ల ముందు చిన్నా పెద్దా తేడాలేకుండా సరదాగా కాల్చుతూ కుటుంబం అంతా సరదాగా గడుపుతూ తపాకులను వెలిగిస్తూ సందడి చేశారు.దీపావళి పండుగను జిల్లాలో అన్ని మండలాల్లో ఘనంగా ప్రజలు జరుపుకున్నారు.

పాడేరు గిరి కైలాస క్షేత్రంలో ఘనంగా కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం

పాడేరు,నవంబర్89,ప్రభాత వార్త

పాడేరు గిరి కైలాస క్షేత్రంలో వెలసిన స్వయంభు, బ్రహ్మసూత్ర శివలింగ స్వరూపం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి కార్తీక మాస ఉత్సవాలు– 2026. సోమవారం సాయంత్రం 6:30 నుంచి వైభవంగా ఆకాశ దీపారాధన కార్యక్రమంతో ప్రారంభం. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి వేద మంత్రోచ్చరణతో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు, ఆలయ గౌరవ అధ్యక్షులు పాడేరు మాజీ శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి డాక్టర్ తమర్న నర్సింగరావు దంపతులు ఆలయ ప్రధాన కార్యదర్శి పూల వెంకటరత్నం ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు భాగ్యలక్ష్మి, కొమ్మోజి వెంకటరమణ, కూడా సురేష్ కుమార్,వంతింభ రాజుబాబు గాయత్రి, ఎంపీటీసీ సభ్యులు కొట్టగుల్లి రమేష్ నాయుడు, కొట్టగుల్లి పోతురాజు, వసంత కుమారి, కోనే శివ, పత్తి మూర్తి మహిళా కమిటీ సభ్యులు సాధనాల ఈశ్వరమ్మ కె జ్యోతి సత్యవతి, ఆధ్యాత్మిక సేవాపంద సభ్యులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్ రేసులో జీకే వీధి జడ్పీటీసీ గిరి ప్రసాద్

రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న వైనం -కాఫీ రైతు నుంచి జడ్పీ పీఠం వైపు అడుగులు



గూడెం కొత్తవీధి,నవంబర్ 9, ప్రభాతవార్త:

విశాఖ ఏజెన్సీ రాజకీయాల్లో జీకే వీధి జడ్పీటీసీ, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో పార్టీని ఏకపక్ష విజయం వైపు నడిపించిన ఆయన, ఇప్పుడు ప్రతిష్టాత్మకమైన జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో ముందంజలో నిలిచారు. జీ.కే వీధి మండలంలోని మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏకంగా 14 స్థానాల్లో వైకాపా జెండా ఎగరేయడంలో గిరి ప్రసాద్ వ్యూహం ఫలించింది.ఇక జడ్పీటీసీ స్థానం నుండి స్వయంగా బరిలోకి దిగిన ఆయన.. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 4,544 పైచిలుకు ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించారు.

రాజకీయ కుటుంబ నేపథ్యం..

1980లో రంపుల గ్రామంలో జన్మించిన కంకిపాటి గిరి ప్రసాద్‌కు రాజకీయాలు కొత్తేమీ కాదు.వారి కుటుంబానికి దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉంది. గిరి ప్రసాద్ తండ్రి కంకిపాటి బాలయ్య పదాలు 1995లోనే పెదవలస పంచాయతీ నుంచి ఎంపీటీసీగా విజయం సాధించగా,అదే ఏడాది ఆయన చిన్నాన్న కంకిపాటి రాజారావు జడ్పీటీసీగా గెలుపొందారు.ఈ విధంగా తండ్రి,చిన్నాన్నల రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న గిరి ప్రసాద్..2018లో వైకాపా తీర్థం పుచ్చుకుని పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఉన్నత విద్యావంతుడు.. కాఫీ రైతు బీపే డిగ్రీ పూర్తి చేసిన గిరి ప్రసాద్ ఉన్నత విద్యావంతుడైనప్పటికీ, మట్టిపై మక్కువతో వ్యవసాయం వైపు అడుగులు వేశారు.ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ సాగుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ దాదాపు 50 ఎకరాల్లో కాఫీ తోటలను సాగు చేస్తూ ఆదర్శ రైతుగా నిలిచారు. అటు వ్యవసాయ రంగంలో, ఇటు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గిరి ప్రసాద్‌కు.. ప్రస్తుత ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పదవి వరిస్తుందా లేదా అనేది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

రౌడీషీటర్లకు ఆరిలోవ సిఐ కౌన్సిలింగ్

ఆరిలోవ, నవంబర్ 9, ప్రభాతవార్త



ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు స్టేషన్ సీఐ ఎన్ శ్రీనివాస్‌ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్ళవద్దనివద్దని, రౌడీషీటర్లకు హెచ్చరించారు. సెటిల్మెంట్లు, గొడవలు, దందాలు, భూ కబ్జాలు చేయవద్దని, సత్ప్రవర్తనతో మసులుకోవాలనన్నారు. పోలీసులు హెచ్చరికలను విస్మరించి నేరాలకు, శాంతి భద్రతలకు విఘాతంకల్పిస్తే పీడీ యాక్ట్, పిట్ (ఎన్ఐపిఎస్) చట్టం ప్రకారం అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని సీఐ హెచ్చరించారు.

కార్తీకమాస పూజా మహోత్సవ ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ

ఆరిలోవ, నవంబర్ 9, ప్రభాతవార్త



పెదగదిలి లోత్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు దాకూరి శివ కన్నాజీరావు ఆధ్వర్యంలో కార్తీకమాస పూజా మహోత్సవాలు మంగళవారం నుండి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఆలయంలో కార్తీకమాస పూజా మహోత్సవ ఆహ్వాన పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు, కార్యదర్శి ఒమ్మి వెంకట అప్పారావు, బొట్ట రమణ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కార్తీకమాసంలో విశేషమైన పూజలు అభిషేకాలు జరుగుతాయని, ప్రతిరోజు రాత్రి 7 గంటలకు ఆకాశదీపారాధన, ప్రతి కార్తీక సోమవారం రోజున ఉదయం నాలుగు గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. 24వ తేదీన కార్తీక పౌర్ణమి మహా పర్వదినం సందర్భంగా స్వామివారికి అభిషేకాలతో పాటు సాయంత్రం లింగాకారంలో దీపారాధన, జ్వాలా తోరణం విశేషంగా జరుగుతాయన్నారు. 27వ తేదీన స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పూజలు అదేవిధంగా డిసెంబర్ 7వ తేదీన మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారికి విశేష పంచామృత అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు.చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో ఉన్న స్ఫటిక లింగ శివాలయంలో కూడా మంగళవారం నుండి అభిషేకాలు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

భానోజీనగర్‌లో వయోజన విద్య తరగతులను పరిశీలించిన డైరెక్టర్ రంజిత్ భాషా



విశాఖపట్నం, నవంబర్ 9, ప్రభాతవార్త

విశాఖ జోన్-3 పరిధిలోని భానోజీనగర్‌లో నిర్వహిస్తున్న వయోజన విద్య (ఉల్లాస్ - అక్షర ఆంధ్ర) తరగతులను రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ రంజిత్ భాషా సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతుల నిర్వహణ తీరును పరిశీలించి, ప్రాథమిక అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన బోధనా కార్యక్రమాలను సమీక్షించారు. వాలంటీర్ టీచర్లు, అభ్యాసకులతో నేరుగా మాట్లాడిన డైరెక్టర్, ప్రతి అభ్యాసకుడికి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు డిజిటల్, ఆర్థిక పరిజ్ఞానాన్ని కూడా అందించి వారిని సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనిసూచించారు.వయోజన విద్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వాలంటీర్ టీచర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌తో పాటు విశాఖపట్నం ఉప సంచాలకులు సుబ్రహ్మణ్యం వర్మ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం ముగ్గురు మహిళా జెడ్పీటీసీలు తీవ్ర ప్రయత్నాలు

ఎవరిని వరించనుందో చైర్మన్ కుర్చీ..?

పాడేరు, నవంబర్9, ప్రభాతవార్త



స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లూరు సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న 11 జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు జెడ్పీటీసీ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో విజయం సాధించి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోనున్నారు. అయితే నూతనంగా ఏర్పడిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్ అయినా చైర్మన్ పదవికి గిరిజన మహిళా జెడ్పీటీసీలు పోటీ పడుతున్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో హుకుంపేట జెడ్పీటీసీగా గెలుపొందిన ఒంటుబు ప్రియాంక చైర్మన్ పదవికి తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. తొలి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి మహిళకు కేటాయిస్తూ తనకు అవకాశం కల్పించాలంటూ అరకు ఎంపీ తనూజ రాణి, పాడేరు ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రాజు,అరకు ఎమ్మెల్యే మత్యలింగం, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగల్లి భాగ్యలక్ష్మి, లాటి పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ వద్దకు వెళ్లి చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని కోరినట్టు తెలుస్తోంది.అలాగే చింతపల్లి జెడ్పీటీసీగా గెలుపొందిన కోరాబు అనూష దేవి వైసిపి పార్టీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.జిల్లా చైర్మన్ పదవి తనకు కేటాయించి న్యాయం చేయాలని అభ్యర్థిస్తూ పాడేరు ఎమ్మెల్యే,వైసిపి జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వరరాజును, ఎంపీ తనూజ రాణిను, అరకు ఎమ్మెల్యే మత్యలింగం,మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,పాల్గుణలను సైతం కలిసి చైర్మన్ పదవి తను వచ్చేలా సహకరించాలని అభ్యర్థించినట్టు తెలుస్తోంది.అలాగే వైసీపీ అధిష్ఠానం పెద్దలను కూడా కలిసే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా సమాచారం. అలాగే అనంతగిరి జెడ్పీటీసీగా గెలుపొందిన దురు జయవర్ధిని జెడ్పీ చైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే అరకు, పాడేరు ఎమ్మెల్యేలతో పాటు అరకు ఎంపీ తనూజ రాణితో పాటు వైసీపీ పెద్దలను కలుస్తున్నట్టు తెలిసింది. జెడ్పీ చైర్మన్ పదవి కోసం ముగ్గురు మహిళలు పోటీ పడటం గమనార్హం. అయితే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ సిఫార్సులు బట్టి ఎవరైతే జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇస్తే బాగుంటుంది..? అనే ఆలోచనల వైసిపి అధిష్ఠానం ఇప్పటికే ఆయా పార్టీల ఇంచార్జీలు, ఎమ్మెల్యేలు ద్వారా సమాచారం తెప్పించుకుంటుందనే సమాచారం ఉంది. చైర్మన్ పదవి ఎంపిక కోసం ప్రభుత్వం రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయనుంది ఈ లోగా చైర్మన్ పదవి ఎవరికి ఇవ్వాలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా అల్లూరి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎవరికి ఇస్తుందో అధిష్ఠానం చైర్మన్ పేరును ఖరారు చేసి ఆరోజే ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.ఐతే ముగ్గురు మహిళలు తీవ్ర పోటీతో జెడ్పీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో..? ఆ అదృష్టం ఎవరిదో రెండు మూడు రోజుల్లో తేలనుంది.ఇదిలా ఉండగా జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో హుకుంపేట ప్రియాంక, చింతపల్లి అనుషాదేవి, అనంతగిరి జెడ్పీటీసి జయ వారధిని పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.వీరిలో అధిష్ఠానం ఎవరివైపు మొ

మృతి చెందిన హెచ్‌సీ వాసుబాబు కుటుంబానికి పోలీసు మిత్రుల అండ

1.80 లక్షల ఆర్థిక సాయం అందజేత

అనకాపల్లి, నవంబర్ 9, ప్రభాతవార్త



గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో అకాల మరణం చెందిన హెడ్ కానిస్టేబుల్ తగరంపూడి వాసుబాబు కుటుంబానికి ఆయన సహచర 2003 బ్యాచ్ పోలీసు సిబ్బంది బాసటగా నిలిచారు. వాసుబాబు పెద్ద కర్మ సందర్భంగా, విశాఖపట్నంలోని ఆయన నివాసంలో సోమవారం వారి చిత్రపటానికి బ్యాచ్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య ఉమాదేవికి, 2003 బ్యాచ్‌కు చెందిన సుమారు 80 మంది సహచరులు సమకూర్చిన 1,80,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సహచరులు మాట్లాడుతూ వాసుబాబు స్పెషల్ పార్టీ, గూడెం కొత్తవీధి వంటి సమస్యాత్మక ప్రాంతాలతో పాటు పలు ఠాణాల్లో సమర్థవంతంగా పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. విధి నిర్వహణలో ఎంతో అంకితభావంతో పనిచేసిన మంచి మిత్రుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వాసుబాబుకు భార్య ఉమాదేవితో పాటు కుమారుడు జస్వంత్ (19), కుమార్తె జిషిత (16) ఉన్నారు. వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు, ఆ కుటుంబానికి భవిష్యత్తులోనూ ఎల్లవేళలా అండగా ఉంటామని బ్యాచ్ సభ్యులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 2003 బ్యాచ్‌కు చెందిన పోలీసు మిత్రులు పాల్గొన్నారు.

ఘనంగా గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల నిలుపుదల మహోత్సవం

అనకాపల్లి నవంబర్ 9, ప్రభాతవార్త



అనకాపల్లి 140 సంవత్సరాల చరిత్ర కలిగిన గవరపాలెం శతకంపట్టు వద్ద గల శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల నిలుపు మహోత్సవం శ్రీ గౌరీపరమేశ్వరి కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. సాయంత్రం దాసరిగెడ్డ రోడ్డులో వున్న విల్లూరి సత్యం పొలం నుండి వరిదిబ్బు తీసుకొచ్చి పూజారితో అమ్మవారి పెట్టించారు.రమేష్ ఆర్ట్స్ వారు రంగులతో రూపొందించిన వినాయక సమేత శ్రీ గౌరీపరమేశ్వరుల విగ్రహానికి ఆలయ పురోహితులు నేతేటి సుబ్రమణ్య శర్మ పూజలు నిర్వహించారు.అనంతరం స్థానిక మనోహర ఆర్కేడ్ నుండి పురవీధుల గుండా తీన్మార్, డీజే, బాండు మేళంలతో ఊరేగించి సోమవారం తెల్లవారుజామున అమ్మవారి గుడిలో నిలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, మద్దాల శంకర్రావు, పెంటకోట వెంకట సత్యనారాయణ, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల కృష్ణంరాజు, పొలిమేర రవి, గండేపల్లి మురళి, బుద్ధ సంతోష్, విల్లూరి పరదేశీనాయుడు, విల్లూరి నానాజీ, పొలమరశెట్టి సూర్య, పిల్లా సత్యనారాయణ, పెంటకోట ఈశ్వర్రావు, పెంటకోట సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు ప్రాణసంకటంగా మారిన గుంత!

నీటితో నిండిన గుంత.. కనిపించని లోతు.. అడుగడుగునా ప్రమాదం!

బుచ్చయ్యపేట, నవంబరు 9 ప్రభాతవార్త



ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత ప్రయాణీకులకు ప్రాణసంకటంగా మారింది. బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామంలోని కో-ఆపరేటివ్ బ్యాంకు సమీపంలో రహదారిపై భారీ గుంత ఏర్పడటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గుంతలో నీరు నిండిపోవడంతో దాని లోతు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చోడవరం-రావికమతం మధ్య రాకపోకలకు కీలకమైన ఈ ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతను దాటే మార్గం తెలియక స్థానికుల సహాయం తీసుకుంటూ ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంది.ప్రజల రాకపోకలకు కీలకమైన ప్రధాన రహదారిపై ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే గుంతను పూడ్చి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఒకే ఆటోలో 19 మంది ప్రయాణీకులు

ఇదేం ప్రమాదకర ప్రయాణం! వలస కార్మికుల ప్రాణాలతో చెలగాటం... నిద్రావస్థలో రవాణా పోలీస్ శాఖల అధికారులు

రాంబిల్లి నవంబర్ 9, ప్రభాతవార్త



మండలంలో వలస కార్మికుల రవాణా ప్రమాదకరంగా మారుతోంది. ఒకవైపు నావికాస్తావరంలో పని చేస్తున్న కార్మికులు, మరోవైపు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి రాంబిల్లి మండ లంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరిని పనిప్రదేశాలకు తరలించే క్రమంలో కొందరు ఆటో డ్రైవర్లు నిబం ధనలను తుంగలో తొక్కుతూ అధిక సంఖ్యలో ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుంటున్నారు. ఒక ఆటోలో ఏకంగా 19 మంది కార్మికులను కుక్కి ప్రయాణం చేయిస్తున్న దృశ్యం స్థానికులను విస్మయానికి గురి చేస్తోంది. ప్రయాణికుల భద్రతను పట్టించుకోకుండా అధిక ఆదాయం కోసం ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆటోలో ఇంతమంది ప్రయాణించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రవాణా శాఖ అధికారులు, ఆర్టీఓ, పోలీస్ సిబ్బంది స్పందించి మండలంలో ఆటోల తనిఖీలు చేపట్టాలని, అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూసివేసిన ప్రభుత్వ బీసీ వసతిగృహాలను వెంటనే పునఃప్రారంభించాలి..

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జ.ఫణీంద్ర కుమార్

ఎస్.రాయవరం, నవంబర్ 9, ప్రభాతవార్త



విద్యా సంవత్సరం మధ్యలో పేద విద్యార్థులు చదువుకునే వసతిగృహాలను మూసివేస్తూ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం అడ్డరోడ్డు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ కె.వి రామలక్ష్మి ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జీ ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు, ప్రభుత్వానికి పేద విద్యార్థుల చదువు, వారి భవిష్యత్తు పైన కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని దెబ్బతీస్తూ, విద్యార్థుల జీవితాలతో చదరంగం ఆడుతోందని మండిపడ్డారు. హాస్టళ్లను మూసివేసి విద్యార్థులను వీధిన పడేసిన అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తున్నానన్నారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించండి, విద్యార్థులు చదువుకోవడానికి మెరుగైన వసతులు కల్పించండి అంటే రాష్ట్ర హోంమంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజక వర్గంలోనే విద్యా సంవత్సరం మధ్యలోనే హాస్టల్స్ మూసివేత పై ఎటువంటి స్పందన లేకపోవడం చాలా దారుణమైన చర్య అన్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఆలోచించి, విద్యార్థులకు న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మణికంఠ, తాతాజీ, రాజేష్, దుర్గా పాల్గొన్నారు.

విజయోత్సవ, ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు లేవు

కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు

కసింకోట, నవంబర్ 9, ప్రభాతవార్త

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో విజయం సాధించిన అభ్యర్థులకు విజయోత్సవ ర్యాలీలు, ఎటువంటి అనుమతులు లేవని కసింకోట సీఐ అల్లుస్వామి నాయుడు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలలో ఉన్నందున తదుపరి సర్పంచ్ ఎన్నికలు పూర్తి అయ్యి, ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని స్వామి నాయుడు తెలిపారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించడానికి ప్రయత్నిస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్వామి నాయుడు హెచ్చరించారు.

పంచాయతీ సర్పంచికి వార్డు సభ్యుడికి గుర్తులు సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్

సర్పంచ్‌కు 25 గుర్తులు, వార్డు సభ్యుడికి 20 గుర్తులు

అనకాపల్లి, నవంబర్ 9, ప్రభాతవార్త

గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఈ నెల 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా సర్పంచి అభ్యర్థుల కోసం 25, వార్డు సభ్యుల కోసం 20 చొప్పున గుర్తులు కేటాయించారు. వీటికి అదనంగా నోటా ఉండనుంది. అభ్యర్థుల సంఖ్య పెరిగితే కొత్త గుర్తులు కేటాయించనున్నారు.

సర్పంచ్ గుర్తులు ఇవే.. మంచం, కత్తెర, ఉంగరం, బుట్ట, వంకాయ, కప్పూ సాసరు, క్యారెట్, తాళం చెవి, గొలుసు, కుర్చీ, బ్యాట్, టెలిఫోన్, బల్ల, మొక్కజొన్న, పలక, ద్రాక్షపళ్లు, తిరగలి, కుండ, అరటిపండు, కొవ్వొత్తులు, సల్లబోర్డు, అనాసపండు, షటిల్, చేతికర్ర, చెంచా.

వార్డు సభ్యుల గుర్తులు.. ప్రెషర్ కుక్కర్, గౌను, స్టూల్, ఇస్త్రీపెట్టె, పోస్ట్ డబ్బా, గ్యాస్ స్టా, బీరువా, ఐస్క్రీమ్, కెటిల్, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, గరాటా, డిష్ యాంటెన్నా, రంపం, కెమెరా, క్యారమ్ బోర్డు, వయో లిన్, బెండకాయ, బెల్టు, కోటు గుర్తులు.

ప్రశాంతంగా ముగిసిన పరిషత్ ఎన్నికలు

మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.శ్రీరాములు -సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

పాయకరావుపేట నవంబర్ 9, ప్రభాతవార్త



మండలంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం అభినందనీయమని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎస్ఎస్ఏ జిల్లా సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.శ్రీరాములు మాట్లాడుతూ పరిషత్ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియ, పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించడానికి రాత్రింబవళ్లు శ్రమించిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు గాను, జిల్లా స్థాయిలో శిక్షణ, సమాచారం, సహాయ సహకారాలు అందించిన జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఎంఆర్వో ఎస్ఏ మహేశ్వరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో శరత్ బాబు, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు సహా మండల స్థాయి అధికారులు,జోనల్ అధికారులు,పత్రిక విలేకరులు, గ్రామ,వార్డు సచివాలయ సహా వివిధ విభాగాల ఎన్నికల సిబ్బందితో పాటు పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఒకరికి మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే. శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు. తహసిల్దార్ మహేశ్వరరావు, సీఐ ఎం.వినోద్ బాబు,డిప్యూటీ ఎంపీడీవో వై.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

150 మంది గర్భిణీ స్త్రీలకు ఈ సేవా కార్యక్రమం

కసింకోట, నవంబర్ 9, ప్రభాతవార్త



మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో సోమవారం శ్రీ సత్యసాయి సేవా సంస్థ అనకాపల్లి జోన్ 2 ఆధ్వర్యంలో 120 మంది గర్భిణీ స్త్రీలకు ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పోషక ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని డిఎంహెచ్వో ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు అప్పలనాయుడు పాల్గొని భగవాన్ బాబా వారి ఆశీస్సులతో తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవ సమన్వయకర్త సుబ్రమణ్యం, అనకాపల్లి జిల్లా ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరావు, గౌరీ, కోట నాయుడు, డాక్టర్ సుమ, డాక్టర్ రామ్ కుమార్, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి నియోజవర్గంలో విజేతలను సత్కరించిన కొణతాల పంచాయితీ ఎన్నికలలోను

ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపు

అనకాపల్లి, నవంబర్ 9, ప్రభాతవార్త



అనకాపల్లి అసెంబ్లీ పరిధి అనకాపల్లి, కశింకోట మండలాల పరిధిలో విజేతలైన, జెడ్ పిటిసి, ఎంపిటిసి సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయమే రాబోయే పంచాయతీ ఎన్నికలకు పునాది కావాలని ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాన్ని రాబోయే పంచాయతీ ఎన్నికలకు పునాదిగా తీసుకొని, ప్రతి పంచాయతీలోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన గెలుపొందిన కూటమి అభ్యర్థులను అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు సాధించగలి గామని తెలిపారు. కొన్ని స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైనప్పటికీ, ప్రజల మద్దతు కూటమికి బలంగా ఉందని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకోవడం విజయానికి ప్రధాన కారణమన్నారు. ఇదే విధానాన్ని రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని సూచించారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ అనే తేడా లేకుండా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలమైన విజయాన్ని సాధించడం ఎంతో అవసరమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు పంచాయతీలు కీలకమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సాధ్యమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని రెట్టింపు ఉత్సాహంతో చేపడతామని హామీ ఇచ్చారు. విజయం సాధించిన తర్వాత అహంకారానికి తావివ్వకుండా, మరింత వినయంతో ప్రజల వద్దకు వెళ్లి ఇతరులను కూడా కలుపుకొని ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుత విజయంతో మరింత బాధ్యత పెరిగిందని, ఇదే ఐక్యత, సమన్వయం, పట్టుదలతో రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ నూటికి నూరు శాతం విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కొణతాల పిలుపునిచ్చారు. ఈ విజయానికి కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అనకాపల్లి, నవంబర్ 9, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, విశాఖపట్నం 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి డీసీసీబీ బ్రాంచ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా బ్యాంకు ఖాతాదారులతో ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, బ్యాంకుతో వారికున్న అనుబంధాన్ని, అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులలో ఉత్సాహాన్ని నింపేందుకు లక్కీ డ్రా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు మాట్లాడుతూ బ్యాంకుతో తమకున్న అనుబంధాన్ని, బ్యాంకు అందిస్తున్న సేవలను, తమకు కలిగిన అనుభవాలను సంతోషంగా పంచుకున్నారు. ఖాతాదారులతో సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, బ్యాంకు అభివృద్ధిలో ఖాతాదారుల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఆర్.వి. లలిత, ఫీల్డ్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, ఏఎం రత్నం, హేమ, వాణ్ణీవి, సొసైటీ ఉద్యోగులు నూకేష్, నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దీపాల వెలుగుల్లో అంబేద్కర్ గురుకులం, కేజీబీవీ

నక్కపల్లి గురుకుల పాఠశాలలో దీపావళి వేడుకలు -ప్రిన్సిపల్ ఉషారాణి, సలీమా ల ఆధ్వర్యంలో

పండుగ సందడి -వెలుగుల పండుగ సందేశంతో విద్యార్థుల్లో ఉత్సాహం

(నక్కపల్లి, ప్రభాతవార్త)



దీపావళి పండుగ సందర్భంగా నక్కపల్లిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల, కేజీబీవీ పాఠ శాలలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రిన్సి పల్ ఉషారాణితో పాటు కేజీబీవీ ప్రిన్సిపాల్ సలీ మాల ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొనగా, విద్యార్థులు ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు.

చీకట్లను పారదోలే వెలుగుల పండుగ

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉషారాణి మాట్లాడుతూ దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యతోనే జీవితాల్లో నిజమైన వెలుగులు నింపుకోవచ్చని పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేయడంతోపాటు ఐక్యత, స్నేహభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందిస్తాయని వివరించారు.

భద్రతతోనే పండుగ ఆనందం



దీపావళి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, బాణసంచా విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పండుగ ఆనందాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవడంతోపాటు అవసరంలో ఉన్నవారికి సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉషారాణి పిలుపు నిచ్చారు. గురుకులంలో జరిగిన దీపావళి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఇదే కాకుండా మండలంలోని భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు జరుపుకున్నారు.



కశింకోటలో 350 మంది విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం

ఈగల్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో -బ్రేక్ ద సైలెన్స్ కాల్ 1972"

కసింకోట, నవంబర్ 9, ప్రభాతవార్త



మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో, సోమవారం కశింకోటలోని ఈసా ఇంటర్మీడియట్ కాలేజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈగల్ అనకాపల్లి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్, సీడ్ సంస్థ (నషా ముక్తి కేంద్రం) సంయుక్త ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో బ్రేక్ ద సైలెన్స్ కాల్ 1972" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈగల్ ఆర్ఐ ఎస్. నారాయణరావు మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం వల్ల విద్యార్థుల విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే, తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు మౌనం వీడి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. బ్రేక్ ద సైలెన్స్ నినాదంతో మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగం లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు.

ప్రజలు ఆదరించారు.. అదే స్ఫూర్తితో ముందుకు పోదాం: కార్యకర్తలకు "వీసం" పిలుపు

కార్యకర్తల కృషికి "వీసం రామకృష్ణ" అభినందనలు.! - 2029 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం: వీసం

నక్కపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త



మండలంలోని పరిషత్ ఎన్నికల్లో స్థానాల సంఖ్య పరంగా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయినా ఓట్ల పరంగా వైకాపా బలాన్ని పెంచుకోగలిగామని, అదే స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని మంచి ఫలితాలు సాధించగలుగుతామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ అన్నారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో వైకాపా అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీకి అండగా నిలిచి మనోధైర్యం కల్పించారని పేర్కొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో నక్కపల్లి మండలంలో తెలుగుదేశం పార్టీకి సుమారు 13 వేల ఓట్ల అధిక్యం లభించగా, తాజా పరిషత్ ఎన్నికల్లో ఆ అధిక్యం 2,300 ఓట్లకు తగ్గిందని రామకృష్ణ తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో ప్రత్యర్థి అధిక్యాన్ని 10,700 ఓట్ల మేర తగ్గించగలిగామని పేర్కొన్నారు. ఈ ఫలితాలు మండలంలో వైకాపా పట్ల ప్రజల ఆదరణ పెరుగుతోందనడానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో ఏ విధమైన స్ఫూర్తిని చూపించారు. అదే ఉత్సాహంతో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో వైకాపా అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆ విజయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ జడ్పిటిసి అభ్యర్థి కాకర వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు తదితరులు ఉన్నారు.

వైఎస్ఆర్సిపి పార్టీకి భారీ షాక్

ఉప్పరపల్లి గ్రామంలో జనసేన పార్టీలో పాయకరావుపేట జనసేన ఇంచార్జి గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో భారీ చేరికలు

ఎస్.రాయవరం, నవంబర్ 9, ప్రభాతవార్త



మండలంలో ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం జనసేన పార్టీలో పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి గెడ్డం బు